క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ముంగి గ్రామానికి చెందిన దత్తారెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.60 వేలు మంజూరయింది. గురువారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆధ్వర్యంలో నాయకులు నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి, అమేర్ తదితరులు బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో విఠల్‌రెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ వినీత్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పలు విషయాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మియాపూర్ ఏసీపీ నరసింహారావు, ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, ఎస్ఐ శశికాంత్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు

జోగిపేట(అందోల్): సమగ్ర శిక్ష తెలంగాణ, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహిస్తున్న చెకుముకి పోటీలు గురువారం ఆందోల్ మండల వ్యాప్తంగా నిర్వహించారు. పాఠశాల స్థాయి ప్రశ్నపత్రాన్ని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ మనోజ్, మండల విద్యాధికారి బండి కృష్ణ, ఎంపీడీఓ రాజేష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని తెలుగు, ఆంగ్ల మధ్యమాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 8, 9, 10వ తరగతులకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు 1498 మంది పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకుడు వి.మహేష్ కుమారచారి తెలిపారు. పాఠశాల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ నెల 21న నిర్వహించే మండలస్థాయి పరీక్షకు హాజరు కావాలని తెలిపారు.

అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు



సరఫరా చేసిన కుళ్లిన గుడ్లు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం బాచేపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు సరఫరా చేశారని గ్రామస్తులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేసిన గుడ్లు కుళ్లిపోయి ఉన్నాయి. గుడ్లు ఉడకబెట్టిన తర్వాత తినలేని విధంగా ఉన్నాయని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యంతో బాలింతలు, చిన్నారులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

సంగారెడ్డి టౌన్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం సంగారెడ్డిలోని తార కళాశాలలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, వారి రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వీటి గురించి తెలుసకోవాలన్నారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

పత్రంపై సీఎం చిత్రం



నారాయణఖేడ్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు ను నవంబర్ 8ను పురస్కరించుకుని నారాయణ ఖేడ్‌కు చెందిన పత్ర చిత్రకారుడు అరటి, అశ్వత్థ ఆకులపై రేవంత్ రెడ్డి చిత్రాన్ని మలచి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ కెమెరాలున్నా.. ఫలితం సున్నా

దోపిడీలు, అసాంఘిక శక్తుల ఆగడాలు, రోడ్డు ప్రమాదాలు వంటి సంఘటలు జరిగినప్పుడు పోలీసులకు దర్యాప్తులో సీసీ కెమెరాల పుటేజీ కీలకంగా వ్యవహరిస్తుంది. కానీ మండలంలో వరుసగా దొంగతనలు జరుగుతున్నా సీసీ కెమెరాలు పని చేయక అలంకార ప్రాయంగా మారాయి. దీంతో పోలీసులు, అధికారుల నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు విమర్శలు చేస్తున్నారు.

- నిఘా నేత్రాల నిర్వహణ అస్తవ్యస్తం
- అలంకారప్రాయంగా మారిన వైనం
- భయాందోళనల్లో ప్రజలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలో దాతలు, ప్రజాప్రతినిధుల విరాళాలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మూలనపడ్డాయి. వాటి నిర్వహణను పంచాయతీలు, అధికారులు పట్టించుకోకపోవడంతో అవి పని చేయడం లేదు. చౌరస్తాలు, పట్టణ, గ్రామ ముఖ ద్వారాలు, రద్దీ ప్రదేశాల్లో, రోడ్లపై విరివిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి నిర్వహణ గాలికొదిలేయడంతో లక్ష్యం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. దీంతో గ్రామాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



గడ్డపోతారం పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న సీసీ టీవీ

పారిశ్రామికవాడల్లో పాడైన నిఘానేత్రాలు

జిన్నారం మండలంలోని గడ్డపోతారం, కాజిపల్లి బొల్లారం పారిశ్రామికవాడల్లో సీసీకెమెరాలు పాడైపోయాయి. వాటిని పట్టించుకునే నాధుడే లేడని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కెమెరాల పర్యవేక్షణలో ఎలాంటి సంఘటన అయిన ఇట్టే తెలిసిపోతుందని అయినా కూడా అధికారులు అటు వైపుగా చర్యలు తీసుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన పరిశ్రమలు గల పారిశ్రామిక వాడల్లో సైతం సీసీ కెమెరాలు లేకపోవడం ఇబ్బందిగా మారింది. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బాగు చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పారిశ్రామిక వాడలో పనిచేయని సీసీ కెమెరాలు

గ్రామాల్లో రెచ్చిపోతున్న దొంగలు

గడ్డపోతారం పరిధిలోని అలీనగర్, కృష్ణయ్యపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో గడ్డపోతారం పరిధిలో దొంగలు లారీలు, ట్యాంకర్లు, ట్రాక్టర్లు బైకులు స్కూటీల బ్యాటరీలను తస్కరించారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలను పట్టుకోలేకపోయారు. నల్తూరులో జరిగిన మేకల దొంగతనం కేసులో ఒక వృద్ధుడిని హత్య చేసిన నిందితులను సీసీ ఫుటేజీ ఆధారంగానే పోలీసులు అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపారు. కేసు విచారణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. రోడ్డు ప్రమాదాల నివారణకు సీసీ కెమెరాలు ప్రధాన సాక్ష్యంగా నిలుస్తాయి.

> **భయాందోళనకు గురవుతున్నాం**
>
> 
>
> ఇంటి బయటపెట్టిన కారు, ద్విచక్ర వాహనాలకు సంబంధించిన బ్యాటరీలు వంటి వస్తువులు దొంగిలిస్తున్నారు. సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. సంబంధిత అధికారులు నాయకులు సమస్యలు పరిష్కరించాలి.
>
> – నాగరాజు, గడ్డపోతారం గ్రామస్తుడు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- అడిషనల్ కలెక్టర్ మాధురి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ మాధురి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. రైతుకు ప్రభుత్వం ద్వారానే మద్దతు ధర లభిస్తుందన్నారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి ఐకెపీ ఏపీఎం నరేందర్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ మధురి

జాబ్‌మేళాతో ప్రయోజనం

- డీఆర్డీఓ పీడీ జ్యోతి

జహీరాబాద్: నిరుద్యోగ యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ పీడీ జ్యోతి పేర్కొన్నారు. గురువారం జహీరాబాద్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరై మాట్లాడారు. తమ శాఖ ద్వారా జాబ్‌మేళాలను నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జహీరాబాద్‌లో మహీంద్ర అండ్ మహీంద్రాలో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. 200 మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. కార్యక్రమంలో మేళా ఇన్‌చార్జి భవాని, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ జ్యోతి

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్‌ఎంసీ డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మయూరినగర్, శ్రీసాయినగర్ కాలనీల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామచంద్రాపురం, భారతినగర్, పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాలనీల్లో ప్రణాళికబద్ధంగా నిధులను కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రధానంగా డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయలతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు చెప్పారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు, కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, నేతలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఓటరు నమోదుకు స్పెషల్ క్యాంపులు

జహీరాబాద్ టౌన్: ఓటరు నమోదుకు ఈ నెల 9,10 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మొగుడంపల్లి తహసీల్దార్ హసీనాబేగం తెలిపారు. ఈ క్యాంపులో ఫారం 6,7,8 అందుబాటులో ఉంటాయన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు నూతన ఓటరు నమోదుకు దర ఖా స్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దర ఖాస్తు చేసుకొవచ్చని చెప్పారు. బూత్‌లెవల్ అధికారి గ్రామాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు.

హెచ్‌ఎంలతో సమావేశం

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ నాగరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్‌ఎస్‌సీ ప్రత్యేక తరగతుల నిర్వహణ, సైన్స్ ఫెయిర్, యూడైస్, మధ్యాహ్న భోజనం పథకం, తదితర అంశాలపై చర్చించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నారాయణఖేడ్: మండలంలోని నాన్యానాయక్ తండాలో గురువారం సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి అఖిలభారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ భూమిపూజ చేశారు. ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహన్ పాల్గొన్నారు.

క్రీడాపోటీల ఏర్పాట్ల పరిశీలన

నారాయణఖేడ్: సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులకు ఈ నెల 10 నుంచి 14 వరకు ఖేడ్‌లో బాలురు, ఆందోల్‌లో బాలికలకు జోనల్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర అధికారి, క్రీడాపోటీల ఇన్‌చార్జి భీమయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన ఖేడ్ మండలం జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మైదానంలో క్రీడాపోటీల ఏర్పాట్లను పరిశీలించారు.

భక్తితోనే మానవజన్మకు ముక్తి

- గరికపాటి నరసింహారావు

నారాయణఖేడ్: భక్తితోనే మానవ జన్మకు ముక్తి లభిస్తోందని మహా సహస్రావధాని గరికపాటి నర్సింహారావు అన్నారు. శ్రీలలిత వైభవం ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లో బుధవారం లలితాదేవి వైభవం అంశంపై దివ్య ప్రవచనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మానవుల జీవితం అతిపవిత్రమైనది. గొప్పలకుపోయి నరకప్రాయంగా మా ర్చుకుంటున్నారన్నారు. గతాన్ని వదిలిపెట్టి వర్తమానంపై దృష్టిసారించి, బంగారు జీవితాన్ని కొనసాగించాలని సూచించారు. భగవంతుడు ఎక్కడో కాదు మన ఒంట్లోనే ఉన్నాడన్నా విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎదుటివ్యక్తి మంచికోసం ప్రయత్నం చేసేలా ఆలోచనలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, లలితవైభవం ట్రస్టు వ్యవస్థాపకులు మలమంచి మోహన్‌జ్యోషి, జీఎంఆర్ ఫౌండర్ మశ్చందర్‌లు గరికపాటిని ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.



గరికపాటిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

జ్ఞాపకశక్తిని పెంచే బ్రెయిన్ యోగా



మాట్లాడుతున్న అందె జీవన్‌రావు

నారాయణఖేడ్: సూపర్ బ్రెయిన్ యోగా జ్ఞాపకశక్తిని పెంచుతుందని గుంజీళ్ల మాస్టార్, రాష్ట్ర అవార్డు గ్రహీత అందె జీవన్‌రావు అన్నారు. ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపర్ బ్రెయిన్ యోగాపై కార్యశాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సూపర్ బ్రెయిన్ యోగాతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని తాజా పరిశోధనలు తెలియజేస్తున్నాయన్నారు. ఈ యోగా ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం, ఏకాగ్రత, మెరుగైన శ్రద్ధ, సృజనాత్మకత, ఆసక్తి, మానసిక సమతుల్యత, రోగనిరోధకశక్తి పెరిగి వత్తిడి నుంచి ఉపశమనం కలుగుతోందన్నారు. ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు, ప్రేరణాత్మక వక్త నరసింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనను సన్మానించారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

- డీఎల్పీఓ అనిత

కంది (సంగారెడ్డి): గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని డీఎల్పీఓ అనిత ఆదేశించారు. గురువారం మండలంలోని చిమ్నాపూర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి నెల వాటర్ ట్యాంకులను కడిగి శుభ్రం చేయాలని సూచించారు. పాత టైర్లు, పూల కుండీల్లో నిలిచే నీటితో దోమలు ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంటుందని తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇచ్చేలా ప్రజలకు పంచాయతీ సిబ్బంది చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పక్కాగా సమగ్ర కుటుంబ సర్వే చేయాలి



జహీరాబాద్ టౌన్: పరిశీలిస్తున్న చంద్రశేఖర్



మునిపల్లి: స్టిక్కర్లు అతికిస్తున్న ఎన్యూమరేటర్లు

- అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా ఎన్యుమరేటర్లు పూర్తి వివరాలను నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్, రాయిపల్లి తండాల్లో ఆయన ఆకస్మికంగా పర్యటించి, తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నిర్వహిస్తున్నట్లు ప్రజలకు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. వివరాల నమోదు అనంతరం ఇంటికి వెళ్లి స్టిక్కర్లు అతికించాలన్నారు. సర్వేను మండల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రజలు కూడా సర్వే చేస్తున్న సిబ్బందికి సహకరించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు ఉన్నారు.

పూర్తి వివరాలు రాయించాలి

మునిపల్లి(అందోల్): సమగ్ర ఇంటింటి సర్వేకు మీ ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లకు పూర్తి సమాచారం ఇవ్వాలని ఎంపీడీఓ హరినందన్‌రావు ఇంటి యజమానులను కోరారు. గురువారం మండలంలోని బుదేరా గ్రామంలో ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు ఎన్యూమరేటర్లు అతికించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. అంతకుముందు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలు అర్థం కాకపోతే, ఒకటికి రెండుసార్లు ఓపికతో అడిగి మరి మీ డౌట్ తీర్చుకోవాలని చెప్పారు. లక్ష్యంతో చదివితే ఉన్నత చదువుల్లో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



జహీరాబాద్ టౌన్ మాట్లాడుతున్న జానకిరెడ్డి

సర్వేపై అవగాహన

కల్హేర్(నారాయణఖేడ్): సమగ్ర కుటుంబ సర్వేపై కల్హేర్ మండల కేంద్రంలో గురువారం ఇంటింటా అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణాచారి ఆధ్వర్యంలో ఇంటింటా సమగ్ర సర్వే స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్ నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ బాగవాన్ చాంద్, నాయకులు లతీఫ్, అనిల్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పరిశీలన

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలో ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వేను గురువారం జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి పరిశీలించారు. మండలంలోని ధనసరి, మాడ్గి గ్రామంలో సర్వే చేస్తున్న సిబ్బంది వద్దకు వెళ్లి నిర్దేశిత ప్రొఫార్మ ప్రకారం వివరాల సేకరణ, నమోదుపై ఆరా తీశారు. ఈ మేరకు సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఇంటింటి సర్వేలో యజమానులు ఇచ్చిన సమాచారాన్ని మాత్రమే సేకరించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం**

మునిపల్లి(అందోల్): వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శేషారెడ్డిని పెద్దగోపులారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండు శాలువాతో సన్మానించారు.

◆ **కార్యకర్త కుటుంబానికి పరామర్శ**

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్ (కె)లో బీఆర్ఎస్ కార్యకర్త బాబునాయక్ మరణించడంతో ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి గురువారం వారి కుటుంబాన్ని పరమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని బాబానాయక్ కుటుంబీకులకు భరోసా ఇచ్చారు. నాయకులు గోపాల్‌రెడ్డి, పవార్‌సింగ్ ఉన్నారు.

◆ **త్వరలో సామాజిక తనిఖీ**

రాయికోడ్(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసిన పనులపై త్వరలో సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఏపిఓ రమేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా ఆడిటింగ్ సిబ్బంది మండలానికి విచ్చేశారన్నారు. గ్రామాల వారీగా పనుల నిర్వహణకు సంబంధించి రికార్డులను వారికి అందజేస్తున్నామన్నారు. రూ.12.29 కోట్ల నిధులను వెచ్చించి చేసిన ఉపాధి పథకం పనులపై తనిఖీ ఉంటుందన్నారు.

◆ **అనుమానాస్పదంగా వ్యక్తి మృతి**

పటాన్‌చెరు టౌన్: భిక్షాటన చేసుకుంటూ జీవించే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అభిమాన్‌సింగ్ కథనం ప్రకారం.. సదాశివపేట మండలం వెంటూరు గ్రామానికి చెందిన దశరథ్(49), స్థానికంగా భిక్షాటన చేసుకుంటూ ఉండేవాడు. అయితే, బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామశివారులో రహదారి పక్కన చనిపోయి ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

◆ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని చందాపూర్‌లో రూ. 10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహించే అభివృద్ధి పనులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తూ, నిధులను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ఖాసీం, జయం, నాగరాజ్, మల్లేశం ,నగేష్, అరవింద్, హైమద్, సర్దార్, మణేయ్య పాల్గొన్నారు.

◆ **సోదరుడి మృతిపై ఫిర్యాదు**

సంగారెడ్డి టౌన్ : సోదరుడి మృతిపై అనుమానం ఉందని సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని హనుమాన్‌నగర్‌లో రంగాయిల రాజు(35), గురువారం రాజు భార్య మాళవిక తన భర్త చనిపోయిన సమాచారాన్ని రాజు సోదరుడు సాయికుమార్‌కు సమాచారం ఇచ్చింది. అక్కడికి వస్తున్నామని చెప్పినా శవాన్ని తీసుకొని తన సొంత గ్రామమైన వెంకటాపూర్‌కు తీసుకెళ్లడంపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

◆ **చికిత్స పొందుతూ ప్రిన్సిపాల్ మృతి**

మునిపల్లి(అందోల్): బుదేరా ప్రభుత్వ మహిళ డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ సి. అర్చన (36), చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజేశ్ నాయక్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. ఈ నెల 6న కళాశాల నుంచి క్యాంపస్‌కు తోటి ఉద్యోగి కరెల వీణాతో కలిసి కారులో వస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుకు కారు ఢీకొంది. దీంతో అర్చన, కరెల వీణకు తీవ్ర గాయాలయ్యాయి దీంతో సదాశివపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శేర్‌లింగంపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ప్రిన్సిపాల్ అర్చన మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజేశ్ నాయక్ తెలిపారు. వీణా చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

◆ **పరిహారం మంజూరులో అవకతవకలు**

జహీరాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరులో అవకతవకలు జరిగాయని బూచనెల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన వారికి పరిహారం మంజూరు చేయలేదని, నారింజ వాగుకు దూరంగా ఉన్న రైతులకు మంజూరు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి. తగిన న్యాయం చేయాలని కోరారు.

◆ **10 మందికి జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్ చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా 10 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **సొంత నిధులతో ఆలయ నిర్మాణం**

పటాన్‌చెరు: పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు కట్టపై రూ.50 లక్షల సొంత నిధులతో సూర్య భగవాన్ దేవాలయం నిర్మించబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఛట్ పూజ ఉపవాస దీక్షల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రత్యేకంగా పటాన్‌చెరు ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో నివసిస్తున్న ఉత్తర భారతీయుల సంక్షేమానికి, ఆర్థిక అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం సూర్య భగవానుడి దేవాలయం నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు చెప్పారు.

ఘనంగా ఛట్ పూజలు



ఛట్ పూజల్లో పాల్గొన్న కొలన్ బాల్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఉత్తరాది రాష్ట్రానికి చెందిన మహిళలు ఛట్ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాత బొల్లారంలోని బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహించిన పూజల్లో మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, పోచమ్మ బస్తీలోని దుర్గామాత మందిరంలో నిర్వహించిన ఛట్ పూజల్లో కౌన్సిలర్ చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాది ప్రజల ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా ఛట్ పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విభిన్న ప్రాంతాలకు చెందిన ప్రజలను అక్కున చేర్చుకొని ఆదరిస్తున్నామన్నారు. కులమత ప్రాంత భేదాలు లేకుండా కలసిమెలసి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయికిరణ్ రెడ్డి శ్రీకాంత్ యాదవ్ చంద్రయ్య గోపాలమ్మ నరసింహారాజు నాయకులు, జీఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.